బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం 24 జులై 2024 | www.balagamtv.com | పేజీలు 3

## నేను అగ్నిపర్వతంలా ఉన్నాను

- మాజీ సీఎం కేసీఆర్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తాను అగ్నిపర్వతంలా ఉన్నానని బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్ష తన బీఆర్ఎస్ ఎల్పీ సమావేశమైంది. ఎమ్మెల్సీలు, ఎమ్మెల్సీలకు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు, బడ్జెట్ నేపథ్యంలో శాసనభలో అనుసరించాల్సిన వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. మండలిలో బీఆర్ఎస్ పక్షనేతగా మధుసూదనాచారిని నియమించారు.

మిగితా 3వ పేజీలో



# మోడీ 3.0 బడ్జెట్



- పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్
- పన్ను శ్లాబుల్లో మార్పు చేసిన కేంద్రం
- ప్రధాన మంత్రి అన్నయోజన పొడిగింపు
- ఏడోసారి బడ్జెట్ ప్రవేశపెట్టి రికార్డు క్రియేట్

బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

మోడీ 3.0 లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తొలి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. వికసిత్ భారత్ లక్ష్యంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం బడ్జెట్‌ను రూపొందించింది. 9 అంశాలను ప్రాధాన్యంగా తీసుకుని బడ్జెట్‌ను రూపొందించారు. వ్యవసాయ రంగంలో ఉత్పాదకతను పెంచడం.. ఉద్యోగ కల్పన- నైపుణ్యాభివృద్ధి, సామాజిక న్యాయం, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక రంగం, రీసెర్చ్- ఇన్నోవేషన్, మానుఫాక్చరింగ్- సర్వీసెస్, భవిష్యత్ తరం సంస్కరణలు అంశాలను ప్రాధాన్యంగా తీసుకుని ఈ బడ్జెట్‌ను తయారు చేసినట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ క్రమంలోనే బడ్జెట్‌లో సామాన్యులు, మధ్య తరగతి ప్రజలకు కేంద్రం కొంత ఊరటను కల్పించింది.

ఇక వరుసగా ఏడోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. రికార్డు సృష్టించారు. ఇప్పటివరకు 6 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన మొరార్జీ దేశాయ్ రికార్డును నిర్మలమ్మ బద్దలు కొట్టారు. 2019 మే 30 వ తేదీ నుంచి కేంద్ర ఆర్థిక మంత్రిగా కొనసాగుతున్న నిర్మలమ్మ.. అప్పటి నుంచి వరుసగా బడ్జెట్‌లను ప్రవేశపెడుతూనే ఉన్నారు. ఈసారి ఒక 1.22 గంటల పాటు బడ్జెట్ ప్రసంగాన్ని నిర్మలమ్మ చదివి వినిపించారు.

### హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ప్రకారం పారిశ్రామికాభివృద్ధికి ప్రత్యేక సహకారం అందిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లోని అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాస్తామని చెప్పారు. అదేవిధంగా విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లోని నోడ్‌లకు ప్రత్యేక సాయం అందిస్తామన్నారు. ఓర్వకల్లు, కొప్పర్తి ప్రారిశ్రామిక కేంద్రాలకు నీళ్ల, విద్యుత్, రోడ్లు హైవేల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నామని వెల్లడించారు. అయితే ఆ మొత్తం ఎంతనే విషయాన్ని మంత్రి స్పష్టం చేయలేదు.

ఇక బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు భారీగా ఆర్థిక సాయం ప్రకటించారు. రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు ప్రత్యేక సాయం అందిస్తామన్నారు. అవసరాన్ని బట్టి భవిష్యత్తులో అమరావతికి

మిగితా 3వ పేజీలో

### పన్ను శ్లాబుల్లో మార్పులు చేర్పులు

- కొత్త పన్ను విధానంలో రూ.3 లక్షల వరకు ఆదాయం ఉన్న వారికి ఎలాంటి పన్నూ లేదు.
- గతంలో రూ.3-6 లక్షల శ్లాబులో 5 శాతంగా పన్ను ఉండగా.. దాన్ని రూ.7 లక్షలకు పెంపు
- గతంలో రూ.6-9 లక్షల శ్లాబుకు 10 శాతం పన్ను ఉండగా దాన్ని రూ.7-10 లక్షలకు మార్పు
- ఇక రూ.10 లక్షల వార్షిక ఆదాయం ఉన్న వారికి 10 శాతం పన్ను వర్తింపు
- రూ.10-12 లక్షల వరకు 15 శాతం పన్ను
- రూ.12- 15 లక్షల 20 శాతం పన్ను
- రూ.15 లక్షల పైన 30 శాతం పన్ను

## బడ్జెట్ 2024 అందరికీ అధికారం ఇస్తుంది

- యువతకు అపరిమిత అవకాశాలు
- 2024 బడ్జెట్‌పై ప్రధాని మోడీ



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2024 కేంద్ర బడ్జెట్‌ను ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం ప్రశంసించారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో విడుదల చేశారు. 'ఈ బడ్జెట్ సమాజంలోని ప్రతి వర్గాన్నీ బలోపేతం చేస్తుంది. దేశంలోని నిరుపేదలు, గ్రామాలు, రైతులను సౌభాగ్య పథంలోకి బడ్జెట్ తీసుకువెళుతుంది' అని ప్రధాని ఒక వీడియో సందేశంలో సూచించారు. 'గడచిన పది సంవత్సరాల్లో ఐదు కోట్ల మందికి దారిద్ర్యం నుంచి విముక్తి లభించింది.ఈ బడ్జెట్ కొత్త మధ్య తరగతి సాధికారత కోసం ఉద్దేశించినది. యువతకు ఈ బడ్జెట్ నుంచి అపరిమిత అవకాశాలు లభిస్తాయి. విద్య, నైపుణ్య రంగాలు ఈ బడ్జెట్ నుంచి కొత్త స్థాయి పొందుతాయి. ఈ బడ్జెట్ కొత్త మధ్య తరగతికి అధికారం ఇస్తుంది. ఈ బడ్జెట్ మహిళలు, చిన్న వాణిజ్యవేత్తలు, ఎంఎస్ఎంఇలకు చేయూత ఇస్తుంది' అని మోడీ తెలియజేశారు. 'మధ్య తరగతికి ఇది కొత్త బలం ఇస్తుంది. ఆదివాసీలు, దళితులు, వెనుకబడిన తరగతుల బలోపేతం లక్ష్యంగా పటిష్ఠ పథకాలతో బడ్జెట్ వచ్చింది' అని ప్రధాని తెలిపారు. కేంద్ర 'ఉపాధి అనుసంధానిత ప్రోత్సాహక పథకం' (ఇఎల్ఐఎస్) గురించి కూడా ప్రధాని మాట్లాడారు. 'దీని వల్ల అనేక ఉద్యోగావకాశాలు కలుగుతాయి. ఈ పథకం కింద కొత్తగా శ్రామిక వర్గంలోకి చేరే వారికి ప్రభుత్వం తొలి వేతనాన్ని ఇస్తుంది. గ్రామాలకు చెందిన యువజనులు అప్రెంటిస్‌షిప్ కార్యక్రమం కింద దేశంలోని అగ్రశ్రేణి సంస్థల్లో పని చేయగలుగుతారు' అని మోడీ తెలిపారు. సంఘటిత రంగాల వ్యాప్తంగా శ్రామిక వర్గంలోకి కొత్తగా చేరేవారికి ఈ పథకం కింద ఒక నెల వేతనం ఇవ్వనున్నట్లు ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో తెలియజేశారు.

## రికార్డు బ్రేక్ చేసిన నిర్మలమ్మ



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రికార్డు సృష్టించారు. వరుసగా ఏడవ సారి బడ్జెట్‌ను సమర్పించి.. రికార్డు నెలకొల్పారు. ఇప్పటి వరకూ మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ పేరిట ఆరు వార్షిక బడ్జెట్‌లు ప్రవేశ పెట్టిన రికార్డు నమోదైంది. 1959-64 మధ్య ఐదు పూర్తిస్థాయి బడ్జెట్లు, ఒక తాత్కాలిక బడ్జెట్‌ను మొరార్జీ దేశాయ్ ప్రవేశ పెట్టారు. కాగా, మోడీ తొలి విడుత మంత్రి వర్గంలో (2014) పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రిగా నిర్మలా సీతారామన్ బాధ్యతలు చేపట్టారు. 2017లో కీలకమైన రక్షణ శాఖ బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత 2019లో రెండోసారి ప్రధాని మోదీ ఎన్నికైన తర్వాత ఏర్పాటైన కేంద్ర మంత్రి వర్గంలోనూ చోటు దక్కించుకున్న నిర్మలా సీతారామన్‌కు అత్యంత కీలకమైన ఆర్థికశాఖను అప్పగించారు నరేంద్రమోడీ. నాటి నుంచి దేశీయ ఆర్థిక రంగంలో మలి విడుత ఆర్థిక సంస్కరణలను పరుగులెత్తించారు. 2019 మే 30 వ తేదీ నుంచి కేంద్ర ఆర్థిక మంత్రిగా కొనసాగుతున్న నిర్మలమ్మ.. అప్పటి నుంచి వరుసగా బడ్జెట్‌లను ప్రవేశపెడుతూనే ఉన్నారు. కేంద్ర మంత్రివర్గంలో మూడోసారి వరుసగా చోటు దక్కించుకున్న ఏకైక మహిళా నాయకురాలిగా నిర్మలా సీతారామన్ రికార్డు నెలకొల్పారు.

## కుర్చీని కాపాడుకోవడానికే బడ్జెట్

- కాంగ్రెస్ అగ్ర నేత, ఎంపీ రాహుల్ గాంధీ



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ కుర్చీని కాపాడుకునేందుకు ప్రవేశ పెట్టిన బడ్జెట్ మాత్రమేనని లోక్ సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. నిర్మలా సీతారామన్ బడ్జెట్ కేవలం అధికార పీఠాన్ని కాపాడుకునేందుకు ప్రవేశ పెట్టిన బడ్జెట్ (కుర్సీ బచావో బడ్జెట్) అని 'ఎక్స్ (మాజీ ట్విట్టర్)' వేదికగా పోస్ట్ చేశారు. బీజేపీ తన మిత్ర పక్షాలను బుజ్జగించేందుకు బూటకపు హామీలు గుప్పించి, ఇతర రాష్ట్రాలకు మొండి చేయి చూపిందని ఆరోపించారు. గత బడ్జెట్లు, కాంగ్రెస్ పార్టీ 2024 లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న ముఖ్యాంశాలను అరువు తెచ్చుకుని 'కాపీ అండ్ పేస్ట్' బడ్జెట్ ను నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టారని ఎద్దేవా చేశారు. ఈ బడ్జెట్ తన మిత్రపక్షాలను సంతోషపెట్టేలా ఉందని ఆరోపించారు. ఇతర రాష్ట్రాలను పణంగా పెట్టి.. బడ్జెట్‌లో తమ మిత్రపక్షాలకు బూటకపు వాగ్దానాలు చేశారని మండిపడ్డారు. తన స్నేహితులను సంతోషపెట్టడం కోసమే ఈ బడ్జెట్‌ను తీసుకొచ్చారని.. దీని నుంచి ఏఏ (అదానీ, అంబానీ) ప్రయోజనం పొందుతారని పేర్కొన్నారు. ఎప్పట్లాగే ఈసారి కూడా సామాన్య భారతీయుడికి ఎలాంటి ఉపశమనం లభించలేదని చెప్పారు. ఇదొక కాపీ పేస్ట్ బడ్జెట్ అని.. కాంగ్రెస్ మేనిఫెస్టో, గత బడ్జెట్‌లను కాపీ కొట్టారని ఎక్స్ వేదికగా ఆయన విమర్శించారు.కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సైతం ఈ బడ్జెట్ మీద విరుచుకుపడ్డారు. రాహుల్ గాంధీ తరహాలోనే.. దీనిని ఓ కాపీ పేస్ట్ బడ్జెట్‌గా అభివర్ణించారు. ఈ మోదీ ప్రభుత్వ కాపీక్యాట్ బడ్జెట్.. కాంగ్రెస్ న్యాయ అజెండాను కూడా సరిగ్గా కాపీ చేయలేకపోయిందని ఖర్గే వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు

## మళ్లీ పరీక్ష అవసరం లేదు

- పేపర్ లీకైన మాట వాస్తవమే
- పరీక్ష రద్దు చేస్తే 24 లక్షల మందిపై ప్రభావం
- నీట్ పేపర్ లీక్ అంశంపై సుప్రీంకోర్టు తీర్పు

వివరాలు 2వ పేజీలో


# తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు షురూ...!


- 25న బడ్జెట్... 31 వరకు సమావేశాలు..
- తొలిరోజుకు లాస్యనందితకు సంతాపం

బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ముందుగా కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతిపట్ల శాసనసభ సంతాపం ప్రకటించింది. లాస్య నందిత మృతికి సీఎం రేవంత్ రెడ్డి సంతాప తీర్మానం ప్రకటించారు. ఈ సందర్భంగా లాస్య నందిత సేవలను, ఆమె తండ్రి సాయన్న సేవలను రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. సంతాప తీర్మానాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బలపరిచారు. అనంతరం శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, సునీతా లక్ష్మారెడ్డి, ముఠా గోపాల్, రాజశేఖర్ రెడ్డి, కేపీ వివేకానంద్ గౌడ్, కూనంనేని సాంబశివరావు, ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పాయల్ శంకర్, మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, శ్రీ గణేశ్.. లాస్య నందిత మృతిపట్ల సంతాపం ప్రకటిస్తూ సీఎం రేవంత్ తీర్మానాన్ని బలపరిచారు. సభ్యులందరూ సంతాపం వ్యక్తం చేసిన తర్వాత స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ రెండు నిమిషాలు సభ్యులతో పటు మౌనం పాటించి.. సభ సమావేశాలను రేపటికి వాయిదా వేశారు. శాసనసభ ముగిసిన వెంటనే బీఏసీ సమావేశం జరగింది.. ఈ సమావేశంలో అసెంబ్లీ నిర్వహణ తేదీలను ఖరారు చేశారు.

శాసనసభలో సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సీఎం మాట్లాడుతూ.. కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలకు సాయన్న గారి కుటుంబం చేసిన సేవలు మరువలేనివని, జనం గుండెల్లో ఆ కుటుంబానికి శాశ్వత స్థానం ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు. కంటోన్మెంట్ దివంగత ఎమ్మెల్యే లాస్య నందిత సాయన్న అకాల మరణానికి చింతిస్తూ శాసనసభలో





తెలంగాణ అసెంబ్లీ సమావేశాలకు షెడ్యూల్ ఖరారు అయ్యింది. సోమవారం అసెంబ్లీ బిజినెస్ అడ్వయిజరీ కమిటీ సమావేశం జరిగింది. మొత్తం ఎనిమిది రోజులు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. జూలై 25న ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క రాష్ట్ర బడ్జెట్ ను అసెంబ్లీలో ప్రవేశ పెట్టనున్నారు. జూలై 31 ద్రవ్య వినిమయ బిల్లుకు గవర్నర్ అమోదం తెలపనున్నారు. సభలో జాబ్ క్యాలెండర్ వంటి కీలక అంశాలు చర్చించే అవకాశం ఉంది.తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ చాంబర్‌లో బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్‌లు, బీఆర్ఎస్ నుంచి హరీష్ రావు, ప్రశాంత్ రెడ్డి, బీజేపీ నుంచి మహేశ్వర్ రెడ్డి, సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు, ఎంఐఎం నుంచి బలాల్ హాజరయ్యారు.

మంగళవారం సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. తీర్మానంపై మాట్లాడుతూ సాయన్న కుటుంబంతో సుదీర్ఘ అనుబంధాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేసుకున్నారు. సాయన్న మరణం తర్వాత కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా గెలిచిన లాస్య నందిత సాయన్న 2024 ఫిబ్రవరిలో రోడ్డు ప్రమాదంలో మరణించడం తనను కలిచివేసిందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు.

కంటోన్మెంట్ ప్రాంతంలో ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం, ఆ ప్రాంతం జీహెచ్ఎంసీలో విలీనమవుతోన్న ప్రస్తుత సందర్భంలో సాయన్న , వారి కూతురు లాస్య నందితమన మధ్య లేకపోవడం అత్యంత బాధాకరమని ముఖ్యమంత్రి అన్నారు. సాయన్న కుటుంబం ఆశయాలను ముందుకు తీసుకెళతామన్నారు. లాస్య నందిత సాయన్న మృతిపై సంతాప తీర్మానాన్ని శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.



# కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై కక్ష



- అన్ని రూపాల్లో నిరసన తెలియజేస్తాం
- సీఎం రేవంత్ రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. "తెలంగాణ పట్ల పూర్తి వివక్షను ప్రదర్శించారు. కక్ష పూరితంగా వ్యవహరించారు. బడ్జెట్‌లో తెలంగాణ అనే పదాన్ని నిషేధించారు. ఈ రకంగా కక్ష పూరితంగా వ్యవహరించడం చరిత్రలో ఎప్పుడూ జరగలేదు" అని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గారు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై మంత్రివర్గ సహచరులతో కలిసి ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో స్పందించారు. తెలంగాణ పట్ల ప్రదర్శించిన వివక్షపై అసెంబ్లీలో చర్చ చేపట్టి ప్రభుత్వ నిరసనను కేంద్రానికి తెలియజేస్తామని చెప్పారు.

"వికసిత్ భారత్‌లో తెలంగాణ భాగం కాదని కేంద్రం భావిస్తున్నట్టు తాజా వైఖరిని బట్టి స్పష్టమవుతోంది. తెలంగాణ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని స్వయంగా మూడు సార్లు ప్రధానమంత్రిని కలిసి కోరాం. వివక్ష లేని, వివాదాలు లేని, కేంద్రం, రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కలిగి అభివృద్ధికి సహకరించాలని కోరాం. కానీ బడ్జెట్‌లో తెలంగాణ అనే పదాన్నే నిషేధించారు" అంటూ ఆందోళన వ్యక్తం చేశారు."ఇతర రాష్ట్రాల కేటాయింపులపై తమకెలాంటి అభ్యంతరాలు లేవు. విభజన చట్టంలో పొందుపరిచిన మేరకు ఆంధ్రప్రదేశ్‌కు నిధులు కేటాయించినప్పుడు అదే చట్టంలో పేర్కొన్న తెలంగాణ అంశాలపై ఎందుకు వివక్ష చూపించారు? ఎందుకు నిధులు కేటాయించలేదు? దక్షిణాది రాష్ట్రాల పట్ల కేంద్రం వివక్ష ప్రదర్శిస్తోంది. ఆ వివక్షపై దక్షిణాది రాష్ట్రాలతో కలిసి పోరాటం చేస్తాం. కలిసొచ్చే ప్రభుత్వాలతో మా వైఖరిని కేంద్రానికి స్పష్టంగా చెబుతాం" అని అన్నారు.

తెలంగాణకు ప్రధానంగా బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీకి నిధులు, ఐఐఎం ఏర్పాటు, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు నిధులు, రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు, వరంగల్ ఎయిర్‌పోర్ట్, మరుగున పడిన ఐటీఐఆర్ ప్రాజెక్టు పునరుద్ధరణ, రైతులకు ప్రత్యేక కార్యాచరణ, వైద్య ఆరోగ్యం, విద్య, ఉపాధి కల్పనలో తెలంగాణకు ఏవీ ఇవ్వలేదన్నారు.

ప్రతి రాష్ట్రంలో ఐఐఎం ఏర్పాటు చేయాలని సంకల్పించిన నేపథ్యంలో తెలంగాణలో ఐఐఎం ఏర్పాటు చేయాలని స్వయంగా ప్రధానమంత్రి గారిని కలిసి విజ్ఞప్తి చేశాం. కానీ తెలంగాణకు ఐఐఎం ఇవ్వబోమని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లేఖ రాశారు. ఎందుకు ఇవ్వరు? ఎందుకింత వివక్ష? అంటూ నిరసన వ్యక్తం చేశారు.

రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గారు స్పందించాలని అన్నారు. "ఈ వైఖరి ఏమాత్రం సమంజసం కాదు. సహేతుకం కాదు. మా నిరసనను కేంద్రానికి తెలియజేస్తాం" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# నిధులు కేటాయించాలని సీఎంను కోరిన ప్రభుత్వ విప్



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు మంగళవారం నుండి మొదలైన నేపథ్యంలో రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టే బడ్జెట్లో గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం, వేములవాడ టెంపుల్ డెవలప్మెంట్ అథారిటీ(వీటీడీఏ)కు నిధులు కేటాయించవలసిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌తో కలసి ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కోరారు.. దీనిపై వారు సానుకూలంగా స్పందిస్తూ తగినన్ని నిధులను కేటాయిస్తానని తెలిపారు..

# ఆలయ ఉద్యోగుల బదిలీలు ఆపండి



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

అసెంబ్లీలో రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం నాయకులు మంగళవారం ప్రభుత్వ విప్ ,లు ఆది శ్రీనివాస్, రాంచందు నాయక్, బిర్ల ఐలయ్య ను కలిశారు. రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సిరిగిరి శ్రీరాములు నేతృత్వంలో అసెంబ్లీలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాంచందు నాయక్, బీర్ల ఐలయ్య ను కలసి రాజన్న కండువా కప్పి లడ్డు ప్రసాదం అందజేశారు. ఆలయ ఉద్యోగుల బదిలీ చేయొద్దని ప్రభుత్వం ఆలయ ఉద్యోగుల బదిలీ విషయం లో పునర్ ఆలోచించాలని కోరారు. వీరి వెంట రాజన్న ఆలయ ఉద్యోగులు పర్యవేక్షకులు నటరాజు, నాగుల మహేష్, గుండి నరసింహ మూర్తి, సీనియర్ అసిస్టెంట్ ఎడ్ల శివ, సురేష్,గడ్డం రాజేందర్, నక్క తిరుపతి ఉన్నారు.



# ముందస్తుగా కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు..

**బలగం టీవీ, ముస్తాబాద్ : ( రాజన్న సిరిసిల్ల )**

ముస్తాబాద్ మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం దగ్గర ముందస్తుగా మాజీ మంత్రివర్యులు కేటీఆర్ జన్మదిన వేడుకలను కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ మండలంలోని వివిధ గ్రామాల యూత్ నాయకులు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షులు మెంగని మనోహర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి, కంచం నరసింహులు, ఎండి.జహంగీర్, కొత్తపెల్లి నారాయణ, తాడెపు అనీల్, వకీల్, వంగూరి దిలీప్, మల్లారెడ్డి, కోడె శ్రీను, బర్కుటి శంకర్, పుల్లూరి శ్రీనివాస్, గడిచెర్ల భరత్, సతీశ్, శ్రవణ్, సుంచు సుదర్శన్, గొండయ్య, మాడూరి శ్రీనివాస్, వెంకటేష్, బాలచంద్రం, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# సి.ఎం.ఆర్.ఎఫ్ చెక్కులు పంపిణీ



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

కాంగ్రెస్ పార్టీ వేములవాడ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం వేములవాడ పట్టణానికి చెందిన 33 మంది లబ్ధిదారులకు సీఎం రిలీజ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ప్రతి



లబ్దిదారుడి ఇంటికి స్వయంగా వెళ్లిన కాంగ్రెస్ నాయకులు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు సక్రమంగా అందక ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిర్విరామంగా కొనసాగుతున్నాయని అన్నారు. ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ల ప్రత్యేక చొరవతో సీఎం ఆర్.ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయని, వారి ఆదేశాల మేరకు నేరుగా లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి చెక్కులు అందించడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా చెక్కుల మంజూరికి కృషి చేసిన సీఎం రేవంత్ రెడ్డితో పాటు విప్ ఆది శ్రీనివాస్ లకు పట్టణ కాంగ్రెస్ పార్టీ తో పాటు లబ్ధిదారుల పక్షాన ప్రత్యేక ధన్యవాదాల తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేష్, నాయకులు చిలుక రమేష్, తుమ్ మధు, వంగల శ్రీనివాస్, ముప్పిడి శ్రీధర్, వస్తాదు కృష్ణ, ముప్పిడి శ్రీనివాస్, నాగుల విష్ణు, సుగూరి లక్ష్మి, తోట రాజు, కొండ శేఖర్, నాగుల రవీందర్, దుర్గం పరశురాం గౌడ్, బైరి సతీష్ (పండు),దాడి మల్లేశం, వినయ్, నాగుల విష్ణు, అక్కనపెల్లి నరేష్, తోట లహరి, నాగుల మహేష్, అక్కి దినేష్, పోతుగంటి వెంకన్న, తౌటు సాయి, బొడ్డు దేవయ్య, తిరుపతి తదితరులు ఉన్నారు..



# విజిబుల్ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి






- కేసుల చేధనకు సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరాలు ఉపయోగించాలి.
- సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్..
- పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన సిరిసిల్ల జిల్లా ఎస్పీ

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

సమస్యలతో స్టేషన్ కు వచ్చే ప్రజల ఫిర్యాదులు స్వీకరించి ఎలాంటి జాప్యం చేయకుండా వాటి పరిష్కారానికి, విజిబుల్ పోలీసింగ్ కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. పోలీస్ అధికారులతో సిరిసిల్ల జిల్లా ఎస్పీ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసుల దర్యాప్తులో ,నేరస్తులను పట్టుకోవటంలో సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సీసీ కెమెరాలను ఉపయోగించి చేధించాలని అధికారులకు సూచించారు. కేసు నమోదయిన వారం రోజుల్లో దర్యాప్తు పూర్తి చేయాలని స్టేషన్ అధికారులు ప్రతి రోజు పెండింగ్ కేసులను సమీక్షా జరపాలని, దర్యాప్తులో వున్న కేసుల్లో బాధితులకు వీలైనంత వరకు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు.

డీఎస్పీ స్థాయి, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు తరచు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లను సందర్శింస్తూ స్టేషన్ పరిధిలో నమోదయ్యే నేరాలపై, తదితర అంశాలపై రివ్యూ చేయాలని ఆదేశించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే రౌడీ షీటర్ల పట్ల,హిస్టరీ షీటర్ల పట్ల కఠినంగా వ్యవహరించడంతో పాటు వారి పై నిరంతరం నిఘా ఉంచాలన్నారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సోషల్ మీడియా నిఘా ఉంచి శాంతి భద్రతలకు విఘాతం కలిగిల పోస్ట్ చేసే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. జిల్లాలో గంజాయి క్రయ, విక్రయాలు,అక్రమ రవాణాపై నిఘా ఉంచి నిర్మూలిస్తూ,యువత గంజాయి బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

నేరాల చేధనలో సీసీ కెమెరాల పాత్ర ప్రజలకు వ్యాపారస్తులకు తెలియజేస్తూ సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు, వ్యాపారస్తులు స్వచ్చందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాల ఏర్పాటు చేసేలా అవగాహన కల్పించాలని,సిరిసిల్ల వేములవాడ పట్టణాల్లో 100 మంది కన్నా ఎక్కువ జనసంచారం ఉండే వ్యాపార, వాణిజ్య సంస్థల్లో తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ ఎంఫోర్స్మెంట్ యాక్ట్ లో భాగంగా సీసీ కెమెరాలు ఉండాలని,ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి తనిఖీ చేసిన సమయంలో సీసీ కెమెరాల లేకున్నా, పని చేయకున్న సంబంధిత యజమాని పై తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ ఎంఫోర్స్మెంట్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులతో కలిసి ప్రమాదాలు ఎక్కువగా జరుగు ప్రదేశాలను గుర్తించి వాటి నివారణకు సూచి బోర్డ్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ లు చంద్రశేఖర్ రెడ్డి, మురళి కృష్ణ, సి.ఐ లు కృష్ణ, మొగిలి,శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మాధుకర్, శ్రీనివాస్, శ్రీలత, ఆర్.ఐ లు మాధుకర్, యాదగిరి, రమేష్, ఎస్.ఐ లు ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు..

## 25న మేడిగడ్డకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

- బడ్జెట్‌లో తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చారు
- బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్‌లో నిరసన తెలపాలి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బీఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలం 25న మేడిగడ్డ పర్యటనకు వెళ్తామని ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రకటించారు ఈ నెల 25న అసెంబ్లీలో బడ్జెట్ అనంతరం.. అదేరోజు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం మేడిగడ్డ పర్యటనకు బయలుదేరుతుందని.. 26న కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించనున్నట్లు తెలిపారు. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, కోవా లక్ష్మి, విజయుడు, ఎమ్మెల్సీ సురభి వాణిదేవితో కలిసి తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీకి చెరో ఎనిమిది సీట్లలో గెలిపిస్తే.. బడ్జెట్‌లో తెలంగాణకు గాడిదగుడ్డు ఇచ్చారన్నారు. పార్లమెంట్‌లో కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలపాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎల్పీ సమావేశం కేసీఆర్ అధ్యక్షతన 3గంటల పాటు జరిగిందన్నారు. శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా మధుసూధనచారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ఎల్పీ మిగతా కార్యవర్గాన్ని త్వరలో ప్రకటిస్తామన్నారు. ఈ నెల 25న అసెంబ్లీలో బడ్జెట్ అనంతరం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ బృందం మేడిగడ్డకు బయలుదేరుతుందన్నారు. 26న మేడిగడ్డ, కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించనున్నట్లు తెలిపారు. లక్షల క్యూసెక్కుల నీరు గోదావరిలో వృథాగా పోతున్నా ప్రభుత్వం పంపుల ద్వారా ఎత్తిపోయడం లేదని విమర్శించారు. మిడ్ మానేరు, కొండ పోచమ్మ సాగర్, రంగ నాయక సాగర్‌లో నీరు నింపి రైతుల పొలాలకు తరలించాలని ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచుతామన్నారు.

ప్రజా సమస్యలను లేవనెత్తేందుకు ఎల్పీ సమావేశంలో కార్యాచరణ ఖరారు చేశామన్నారు. నిరుద్యోగుల సమస్యలపై రేపు చర్చ కోసం రేపు అసెంబ్లీలో వాయిదా తీర్మానం ఇవ్వనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడునెలల్లో పాల్పడ్డ కుంభకోణాలపై అసెంబ్లీలో నిలదీస్తామన్నారు. పౌరసరఫరాలశాఖలో కుంభకోణాలు జరిగాయని.. వాటిని లేవనెత్తనున్నట్లు తెలిపారు. వేరే రాష్ట్రాల్లో నిషేధించిన బీర్లను ఇక్కడ ప్రవేశ పెట్టేందుకు చేసిన ప్రయత్నాల వెనుక ఉన్న అదృశ్య శక్తుల బండారాన్ని బయట పెట్టాలని అసెంబ్లీలో నిలదీస్తామన్నారు. మంత్రికి తెలియకుండానే నిషేధిత బీర్ల ప్రవేశం కోసం ప్రయత్నం ఎలా జరిగింది అనే దానిపై చర్చకు పట్టుబడుతామన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుపై అసెంబ్లీలో ప్రస్తావిస్తామన్నారు. కిరణ్ కుమార్ రెడ్డి హయాంలో మిగిలి పోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తమ ప్రభుత్వం చెల్లించిందని గుర్తు చేశారు.

ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే ప్రక్రియలో జాప్యంపై నిలదీస్తామని చెప్పారు. రైతు భరోసాలో ఆలస్యంపై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచనున్నట్లు తెలిపారు. ఫిరాయింపులపై అసెంబ్లీలో ప్రత్యేక వ్యూహంతో ముందుకు వెళ్తామన్నారు. కేసీఆర్ అన్ని అంశాలపై తమకు దిశానిర్దేశం చేశారన్నారు. కేంద్ర రాష్ట్రాల మధ్య సత్సంబంధాల కోసమే మంత్రులతో భేటీలు అన్న రేవంత్ ఇప్పుడేం చెబుతారని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ తెలంగాణకు జరిగిన అన్యాయంపై మాట్లాడారా? అంటూ నిలదీశారు. రాహుల్ గాంధీతో తెలంగాణకు జరిగిన అన్యాయంపై రేవంత్ మాట్లాడించాలని.. ప్రధాని కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ఎంపీలు ధర్నా చేయాలన్నారు.కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎల్పీ సమావేశానికి ముందస్తు అనుమతితోనే కొందరు ఎమ్మెల్యేలు భేటీకి హాజరుకాలేదని క్లారిటీ ఇచ్చారు.

**వడ్ల కొనుగోలులో భారీ కుంభకోణం**

వడ్ల కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం భారీ కుంభకోణం చేసిందని, వాటిని అసెంబ్లీలో లేవనెత్తుతామని ఆయన అన్నారు. ఇందులో ఎవరు ఉన్నా వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వేరే రాష్ట్రాల్లో నిషేధించిన బీర్లను ఇక్కడ ప్రవేశ పెట్టేందుకు చేసిన ప్రయత్నాల వెనుక ఉన్న అదృశ్య శక్తుల బండారాన్ని బయట పెట్టాలని అసెంబ్లీలో నిలదీస్తామన్నారు. మంత్రికి తెలియకుండానే నిషేధిత బీర్ల ప్రవేశం కోసం ప్రయత్నం ఎలా జరిగిందనే దానిపై చర్చకు పట్టు బడుతామన్నారు. ఫీజు రీ ఎంబర్స్ మెంట్ బకాయిల చెల్లింపుపై అసెంబ్లీలో ప్రస్తావిస్తామన్నారు. కిరణ్ కుమార్ రెడ్డి హాయంలో మిగిలి పోయిన ఫీజు రీఎంబర్స్ మెంట్ బకాయిలు బీఆర్ఎస్ ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు.

# తెలంగాణకు మరోసారి అన్యాయం

- బీఆర్ఎస్ నేత బి.వినోద్ కుమార్




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో తెలంగాణకు మరోసారి అన్యాయం జరిగిందని బీఆర్ఎస్ నేత బి.వినోద్ కుమార్ అన్నారు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ లో తెలంగాణ అనే పదాన్ని కూడా ఉచ్చరించలేదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టానికి అనుగుణంగా నిధులు కేటాయిస్తానని చెప్పారు. కానీ, అమరావతికి మాత్రమే రూ.15 వేల కోట్లు కేటాయించారన్నారు. కేంద్ర బడ్జెట్‌పై మంగళవారం ఆయన స్పందించారు. ఏపీలోని శ్రీకాకుళం చెన్నై కారిడార్ గురించి ప్రస్తావించారు...అదే సమయంలో హైదరాబాద్, నాగ్‌పూర్ కారిడార్‌కు కూడా నిధులు కేటాయిస్తే బాగుండేదన్నారు. "హైదరాబాద్-బెంగళూరు కారిడార్ గురించి ప్రస్తావించారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు వరకు చూసుకుంటే కేవలం 150 కిలోమీటర్లు మాత్రమే తెలంగాణలో ఉంటుంది... మిగతాదంతా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాయలసీమలో ఉంటుంది. నిజంగా తెలంగాణకు ఇండస్ట్రియల్ కారిడార్ ప్రకటించదలచుకుంటే హైదరాబాద్-నాగపూర్ కారిడార్ ను ప్రకటించాలి. దానివల్ల ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఏపీలోని పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ప్రకటించారు. ఇప్పటికే చాలా కేటాయింపులు చేశారు. మరింత సాయం అందిస్తామని కూడా చెబుతున్నారు... మంచిదే. అందుకు ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ తెలంగాణలో గోదావరిపై, కృష్ణా నదిపై జాతీయ ప్రాజెక్టుల గురించి చాలా రోజులుగా డిమాండ్ చేస్తున్నప్పటికీ నిర్మలా సీతారామన్ ఒక్క ప్రస్తావన కూడా చేయకపోవడం దురదృష్టకరం. ఈ బడ్జెట్ లో చంద్రబాబు, నితీశ్ కుమార్ ల రాష్ట్రాలకే పెద్ద ఎత్తున కేటాయింపులు చేసినట్టు స్పష్టంగా కనిపిస్తోంది. లోక్ సభలో బీజేపీకి 8 మందిని, కాంగ్రెస్ కి 8 మందిని తెలంగాణ ప్రజలు గెలిపించారు. మరి ఈ 16 మంది ఎంపీలు బడ్జెట్ చర్చలో పాల్గొని, విభజన చట్టం ప్రకారం తెలంగాణకు రావాల్సిన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం, ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్, నవోదయ విద్యాలయాలు, జాతీయ ప్రాజెక్టులు ,రైల్వే లైన్లు తదితర విషయాల్లో పట్టుబట్టి బడ్జెట్ సమావేశాలు పూర్తయ్యేలోపు సాధించుకోవాలి" అని అన్నారు.

# మళ్లీ పరీక్ష అవసరం లేదు



- పేపర్ లీకైన మాట వాస్తవమే
- పరీక్ష రద్దు చేస్తే 24 లక్షల మందిపై ప్రభావం
- నీట్ పేపర్ లీక్ అంశంపై సుప్రీంకోర్టు తీర్పు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

నీట్ పేపర్ లీక్ అంశంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. విచారణ ముగియగా సీజెఐ డివై.చంద్రచూడ్ ధర్మాసనం.... నీట్ యూజీ ప్రశ్నాపత్రం లీకైన మాట వాస్తవమేనని నిర్ధారించింది. బీహార్ లోని హజారీబాగ్ లో, పాట్నాలోనూ పేపర్ లీకైందని తెలిపింది. 150 మంది విద్యార్థులు నీట్ పేపర్ లీక్ తో లబ్ది పొందారని సీజెఐ ధర్మాసనం వెల్లడించింది. అయితే దేశమంతా నీట్ పేపర్ లీకైనట్టు ఆధారాలు లేవని, అందువల్ల నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. నీట్ ఎంట్రెన్స్ రద్దు చేయాలన్న వాదనలో అర్థం లేదని, నీట్ పరీక్ష రద్దు చేస్తే 24 లక్షల మందిపై ప్రభావం పడుతుందని అభిప్రాయపడింది. కాగా లీక్ తో లబ్ది పొందిన విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని సుప్రీం ఆదేశించింది. నీట్ నిర్వహణలో లోపాలు ఉన్నాయని అభిప్రాయపడింది.

# అసెంబ్లీలో కేసీఆర్ ఛాంబర్‌పై కేటీఆర్ అసంతృప్తి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

అసెంబ్లీలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కేటాయించిన ఛాంబర్‌పై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గత సమావేశాల సందర్భంగా ఇన్నర్ లాబీలోని ఎల్‌వోపీ కార్యాలయాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తొలగించిన విషయం తెలిసిందే. ఔటర్ లాబీలో ఎల్‌వోపీకి ఛాంబర్ ఏర్పాటు చేశారు. రెండు రూమ్‌లు కలిపి ఒకే రూంగా అసెంబ్లీ సిబ్బంది మార్చేశారు. అయితే దాన్ని కేసీఆర్‌కు కేటాయించడంపై కేటీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రూం మధ్యలో టాయిలెట్ పెట్టి వాడుకోవడానికి అనుకూలంగా లేకుండా చేశారని మేండిపడ్డారు. ఈ అంశాన్ని బీఏసీలో లేవనెత్తాలని మాజీ మంత్రి హరీష్‌రావుకు కేటీఆర్ సూచించారు. స్పీకర్‌ను కలిసి అభ్యంతరం వ్యక్తం చేయాలని కేటీఆర్ నిర్ణయించారు.

# నేను అగ్నిపర్వతంలా ఉన్నాను



(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ కక్షతోనే తన కుమార్తెను జైలులోపెట్టారట్టాని ఆరోపించారు. సొంత బిడ్డ జైలులో ఉంటే కన్నతండ్రిగా బాధ ఉండదా? అంటూ ప్రశ్నించారు. క్లిష్ట పరిస్థితులు ఏమీ లేని.. ఇంతకంటే ఇబ్బందికర పరిస్థితుల్లో తెలంగాణను సాధించామని స్పష్టం చేశారు. నలుగురు ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ అధికారంలోకి రాలేదా? అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ఎమ్మెల్యే బాగా ఎదుగు తారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టు సాధించలేక పోయిందని.. పాలనపై దృష్టి పెట్టకుండా అభాసుపాలు చేసే పనిలోనే ఉన్నారని విమర్శించారు. శాంతిభద్రతలు ఎందుకు అదుపుతప్పుతున్నాయని నిలదీశారు. ఎక్కడో ఉన్న వారిని నేతలను చేస్తే పదవులు వచ్చాక పార్టీని వీడుతున్నారని.. పార్టీ వదిలి వెళ్లేవారిని గురించి ఆలోచించాల్సిన అవసరం లేదని కేసీఆర్ స్పష్టం చేశారు.

## ‘ఆత్మనిర్భర భారత్’ నిర్మాణమే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

%కేంద్ర బడ్జెట్ సమతూకంగా ఉందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. దేశీయ ఉత్పత్తిని పెంపొం దించడానికి%ా%. మధ్య, ఎగువ మధ్య తరగతి వారికి పన్ను ఆదా ప్రకటించిందని తెలిపారు. వీధి వ్యాపారుల నుంచి మొదలు రైతులు, పారిశ్రామికవేత్తల వరకు అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చే విధంగా బడ్జెట్ ఉందని అన్నారు. ఆత్మనిర్భర భారత్ నిర్మాణమే లక్ష్యంగా కేంద్రం బడ్జెట్ ప్రవేశ పెట్టిందని చెప్పుకొచ్చారు.

కోటిమంది పట్టణ పేద, మధ్యతరగతి కుటుంబాల గృహ అవసరాలను తీర్చడానికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడిని కేంద్రం బడ్జెట్‌లో ప్రతిపాదించిందని. 4 కోట్ల మంది యువతకు ఉపాధి కల్పించడమే కేంద్రం లక్ష్యం పెట్టుకుందని కిషన్ రెడ్డి తెలిపారు. ‘సబ్ కా సాథ్ సబ్ కా వికాస్’లో భాగంగా పేదలను శక్తివంతం చేయడం, అన్నదాత ఉత్పాదక సామర్థ్యాలను పెంచేలా కేంద్రం నిర్ణయం తీసుకుందని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.1.5 లక్షల కోట్లు బడ్జెట్‌లో పెట్టామని. మహిళలు, బాలికలకు లబ్ధి చేకూర్చే పథకాలకు రూ.3 లక్షల కోట్ల మేర ప్రతిపాదనలు నరేంద్ర మోడీ సర్కారు చేసిందన్నారు. పన్ను చెల్లింపుదారులకు ఉపశమనం కల్పించేలా పన్ను స్లాబ్‌లను మార్చిందని%ా% పెరిగిన స్టాండర్డ్ డిడక్షన్ ద్వారా 4 కోట్ల మందికి మేలు జరగనుందని కిషన్ రెడ్డి వివరించారు.

## బోగత జలపాతం లోయలో పడి యువకుడు మృతి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని చికుపల్లి బోగత జలపాతం లోయలో పడి యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన మంగళవారం జరిగింది. వరంగల్ జిల్లా ఏనుమాముల మార్కెట్ సుందరయ్య నగర్ గ్రామానికి చెందిన బొనగాని జస్వంత్ (19) అనే యువకుడు తన తోటి మిత్రులైన సాయి కిరణ్, నాగేంద్ర, సుశాంత్ వంశీ గౌస్ కలిసి చీకుపల్లి బొగతను సందర్శించడానికి వచ్చారు. బొగత అందాలను తిలకించిన వీరు బొగతలో ఇలా స్నానం చేసేందుకు దిగారు.. వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో జస్వంత్ నీటమునిగి గల్లంతయ్యాడు ఈ విషయం తెలుసుకున్న వెంకటాపురం సీఐ బండార్ కుమార్, వెంకటాపురం ఎస్సై తిరుపతి సంఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టగా యువకుడి మృతదేహం లభ్యమైనది. ఈ యువకుడు వాగ్దేవి కళాశాలలో బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. తోటి మిత్రులతో కలిసివచ్చి కానరాని లోకాలకు వెళ్లిపోవడంతో స్నేహితులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

# ఏవి పెరుగుతాయి... ఏవి తగ్గుతాయి



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రదర్శించిన బడ్జెట్‌లో కొన్ని వస్తువుల ధరలు పెరగ్గా, కొన్నిటి ధరలు తగ్గించారు. బంగారం, వెండి, ప్లాటినం వంటి ఇతర విలువైన లోహాలు,దిగుమతి చేసుకున్న మొబైల్ ఫోన్లు, నిర్దిష్టమైన క్యాన్సర్ ఔషధాలు, వైద్య పరికరాలపై కస్టమ్స్ డ్యూటీ తగ్గించి నట్టు బడ్జెట్‌లో ప్రకటించారు. దీంతో ఇవి చవకగా అందుబాటు లోకి రానున్నాయి. ఇక ధరలు పెరిగిన వస్తువుల్లో దిగుమతి చేసుకున్న గార్డెన్ అంబ్రెల్లాలు,లేబొరేటరీ రసాయనాలపై కస్టమ్స్ డ్యూటీ పెంచడంతో వీటి ధరలు ప్రియం కానున్నాయి.

### ధరలు తగ్గేవి

**విలువైన లోహాలు**

బంగారం, వెండి వస్తువులు, కడ్డీలపై కస్టమ్స్ డ్యూటీని10 నుంచి 6 శాతానికి తగ్గించారు. ప్లాటినం , పల్లాడియం, ఓస్మియమ్, రుథేనియం, ఇరీడియం వంటి విలువైన లోహాలపై కస్టమ్స్ డ్యూటీ 15.4 శాతం నుంచి 6.4 శాతం వరకు తగ్గించారు. ఇవి కాకుండా 25 ముఖ్యమైన ఖనిజాలపై కస్టమ్స్ డ్యూటీలో మినహాయింపు ప్రకటించారు. విలువైన లోహాల నాణేలు. విలువైన లోహాల తయారీలో మూలకాల సమ్మేళనాల్లో, ఉత్ప్రేరకాల్లో ప్లాటినం, పెల్లేడియం ఉపయోగిస్తుంటారు. మూడు క్యాన్సర్ ఔషధాలపై కస్టమ్స్ డ్యూటీ తొలగింపు ట్రస్టుజుమాబ్ డెరక్స్‌టెకన్, ఒసిబెర్టినిబ్, దుర్వలుమాబ్ ఈ మూడు రకాల క్యాన్సర్ ఔషధాలపై కస్టమ్స్ డ్యూటీని పూర్తిగా తొలగించారు.దీంతో క్యాన్సర్ రోగులకు మేలు చేసినట్టయింది.

**వైద్య పరికరాలు**

ఆర్థోపెడిక్ పరికరాల తయారీలో పోలీఇథలిన్ అన్ని రకాలు ఉపయోగపడుతుంటాయి. వైద్యరంగంలో సర్జికల్, డెంటల్, లేదా వెటర్నరీలో ఉపయోగించే ఎక్స్‌రే యంత్రాల తయారీకి ఎక్స్ రే ట్యూబ్స్, ఫ్లాట్ ప్యానెల్ డిటెక్టర్లు ఉపయోగపడు తుంటాయి. వీటన్నిటి ధరలు బడ్జెట్‌లో తగ్గుతున్నట్టు ప్రకటించారు.

**మొబైల్ ఫోన్లపై 15 శాతం డ్యూటీ తగ్గింపు**

దిగుమతి చేసుకునే సెల్యులర్ మొబైల్ ఫోన్లు, ఫోన్ చార్జర్లు, అడాప్టర్లు, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్ అసెంబ్లీ (పిసిబిఎ)పై 15 శాతం వరకు కస్టమ్స్ డ్యూటీ తగ్గించారు. దీంతో స్థానికంగా మొబైల్ ఫోన్ల తయారీ పెరగడమే కాక, ఎగుమతులు పెరుగుతాయి. దీంతో మొబైల్ ఫోన్లు, ఛార్జర్లు చౌకగా లభిస్తాయి.

**సోలార్ పరికరాలు**

సోలార్ సెల్స్ తయారీకి ఉపయోగపడే వస్తువులు, సోలార్ మోడ్యూల్స్, వాటి తయారీకి వినియోగించే పరికరాలు ఉన్నాయి.

**సీఫుడ్స్‌జి**

చేపలు, రొయ్యల ఫీడ్‌పై ఉన్న బేసిక్ కస్టమ్స్ డ్యూటీని 5 శాతం తగ్గించారు. ఫీడ్, చేప చమురు ధరలు తగ్గుతాయి.

**నేచరల్ గ్రాఫైట్**

గ్రాఫైట్‌కు ఉపయోగించే అన్ని రకాల సహజ ఇసుక, క్వార్ట్జ్, కీలకమైన ఖనిజాలు, లిథియం కార్బొనేట్, లిథియం ఆక్సైడ్, హైడ్రాక్సైడ్, పొటాషియమ్ నైట్రేట్స్

**ఉక్కు రంగం**

ఫెర్రో నికెల్, బ్లిస్టర్ కాపర్, వస్త్ర, చర్మ పరిశ్రమ వస్త్రాలు, లెదర్ ఉత్పత్తిలో స్పాండెక్స్ యార్న్ (సింథటిక్ దారం) తయారీకి అవసరమైన మెథిలిన్ డైఫినైల్, డై ఐసోసైనేట్.

### ధరలు పెరిగేవి

పోలీ వినైల్ క్లోరైడ్ (పివిసి) ఫ్లెక్స్ ఫిలింలు, గార్డెన్ అంబ్రెల్లాలు, లేబొరేటరీ రసాయనాలు, సోలార్ సెల్స్ , మాడ్యూల్స్ తయారీకి కావలసిన సోలార్ గ్లాస్, టిన్డ్ కాపర్. పివిసి ఫ్లెక్స్ బ్యానర్లపై 10 శాతంగా ఉన్న బేసిక్ కస్టమ్స్ డ్యూటీని 25 శాతానికి పెంచడమైంది.



# మోడీ 3.0 బడ్జెట్



(మొదటి పేజీ తరువాయి)

మరిన్ని అదనంగా నిధులు కేటాయి స్తామన్నారు. ఏపీ విభజన చట్టానికి అనుగుణంగా పోలవరం సత్వర నిర్మాణానికి సంపూర్ణ సాయం ఉంటుందన్నారు. పోలవరానికి కావాల్సిన నిధులు అందిస్తామని చెప్పారు. పోలవరం ఆంధ్రప్రదేశ్‌కు, రైతులకు జీవనాడి వంటిదన్నారు. అది భారత ఆహార భద్రతకు ఎంతో కీలకమైందని చెప్పారు.

ఈ వార్షిక బడ్జెట్‌లో రెవెన్యూ రాబడులు 31.3లక్షల కోట్లుగా పేర్కొన్న ఆర్థిక మంత్రి, మూలధన రాబడులను రూ.16.9 లక్షల కోట్లుగా వివరించారు. రెవెన్యూ వ్యయాన్ని రూ.37.1 లక్షల కోట్లుగా వివరించిన మంత్రి మూలధన వ్యయం రూ.15లక్షల కోట్లు అని పేర్కొన్నారు. రెవెన్యూ లోటు జీడీపీలో 4.9 శాతంగా ఉంటుందని వివరించారు. బడ్జెట్‌లో అత్యధికంగా రక్షణ రంగానికి రూ.4,54,773 కోట్లు ప్రతిపాదించారు.

ఇక తొమ్మిది ప్రాధాన్య అంశాల ఆధారంగా ఈ కేంద్ర బడ్జెట్‌ను రూపొందించారు. వ్యవసాయ రంగంలో ఉత్పాదకత, ఉద్యోగ కల్పన- నైపుణ్యాభివృద్ధి, సామాజిక న్యాయం, పట్టణా భివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక రంగం, పరిశోధన- ఆవిష్కర ణలు, తయారీ-సేవలు, తర్వాత తరం సంస్కరణలు అంశాలను ప్రాధాన్యంగా తీసుకున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఈ ప్రాధాన్యాలను నెరవేర్చే దిశలో స్పష్టమైన మార్పులు కనిపించేలా ఈ బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయని అన్నారు. గత ప్రకట నలను బలోపేతం చేయడం సహా సమర్థంగా అమలు చేసేలా ఈ బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయి. వికసిత్ భారత్ లక్ష్యాన్ని వేగంగా చేరుకునే ప్రయాణంలో భాగంగా ఈ చర్యలు ఉంటాయి.

వ్యవసాయ రంగంలో ఉత్పాదకతను భారీగా పెంచేందుకు మొదటి ప్రాధాన్యం ఇచ్చారు నిర్మల సీతారామన్. వచ్చే ఐదేళ్లలో సుమారు నాలుగు కోట్ల ఉద్యోగాలను లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించిన మంత్రి సామాజిక న్యాయాన్ని బలోపేతం చేసేందుకు పలు చర్యలను ప్రతిపాదించారు. పట్టణాభివృద్ధి, ఇంధన భద్రతకూ పెద్దఎత్తున నిధులు కేటాయించారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు పలు ప్రతిపాదనలు చేశారు. నూతన ఆవిష్కరణలు, పరిశోధన, అభివృద్ధికి సంబంధించిన ప్రాధాన్యాలను వివరించిన మంత్రి వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా భవిష్యత్ సంస్కరణలకు కూడా పెద్దపీట వేస్తామన్నారు.

మౌలిక రంగంలో ప్రైవేటు పెట్టుబడులను భారీగా పెంచడమే లక్ష్యంగా బడ్జెట్‌లో చర్యలు చేపట్టినట్లు వివరించిన ఆర్థిక మంత్రి మూలధన వ్యయం కింద రూ.11 లక్షల కోట్లు ప్రతిపాదించారు. మౌలిక రంగానికి ఆర్థికంగా పూర్తి భరోసా ఇస్తామన్న రాష్ట్రాలకు సైతం వాటి అభివృద్ధి ప్రాధాన్యాలకు అనుగుణంగా మద్దతు ఇస్తామని చెప్పారు. దీర్ఘకాలిక రుణాలకు వడ్డీ రాయితీలో భాగంగా లక్షా 50 వేల కోట్లు కేటాయించారు.

## తెలుగు కోడలు
# తెలంగాణకు ఏమీ ఇవ్వలేదు..



● బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలుగు కోడలు నిర్మలా సీతారామన్ తెలంగాణ రాష్ట్రానికి కూడా ఏమైనా భారీగా బడ్జెట్ లో నిధులు కేటాయిస్తారని ఆశించామని, అయితే కానీ దక్కింది శూన్యం అని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు.. కేంద్రం రూ. 48,21,000 కోట్లతో బడ్జెట్ పెట్టినప్పటికీ కేవలం కొన్ని రాష్ట్రాలకు మాత్రమే పెద్దపీట వేశారని., బడ్జెట్ మొత్తంలో తెలంగాణ ప్రస్తావన లేకపోవడం బాధాకరమని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి మరొకసారి దక్కింది గుండు సున్నానే అంటూ వ్యాఖ్యా నించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో దాదాపు 35 హామీల పైన నిర్ణయం తీసుకోవాలని గతంలో కేసీఆర్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారని, అనేకసార్లు అభ్యర్థిస్తూ లేఖలు కూడా రాశామని గుర్తు చేశారు.. ములుగు యూనివర్సిటీకి అదనపు నిధులు, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ.. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఊసే లేదని., రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోలేవటం లేదని ఆయన వాపోయారు. తెలంగాణలో 16 స్థానాలను బీజేపీ, కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీలకు ఇస్తే ఏం జరిగిందో తెలంగాణ ప్రజలు ఆలోచించాలన్నారు. 16 స్థానాలు ఉన్న ఆంధ్రప్రదేశ్ కు, బీహార్ కి దక్కిన నిధులను చూసైనా తెలంగాణ ప్రజలు ఆలోచన చేయాలన్నారు. స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలం గాణకు శ్రీరామ రక్ష అన్న విషయాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరముందని చెప్పారు కెటిఆర్., ఎందుకు ప్రాంతీయ శక్తులను బలోపేతం చేసుకోవాలో మరోసారి ఈ ఘటన తెలియజేస్తోందని అన్నారు. పార్లమెంట్లో కూర్చున్న బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు కేంద్ర మంత్రులు ఒక్క మాట కూడా పార్లమెంట్లో మాట్లాడలేని ధ్వజమెత్తారు.

# దిశానిర్దేశం లేని బడ్జెట్...



బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ 2024-25పై పశ్చిమబెంగాల్ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విమర్శలు గుప్పించారు. దిశానిర్దేశం లేని, ప్రజావ్యతిరేక, రాజకీయ పక్షపాత బడ్జెట్ అని అభివర్ణించారు.బడ్జెట్‌లో విజన్ లోపించిందని, పూర్తిగా రాజకీయ ఉద్దేశాలతో రూపొందించారని అని చెప్పారు. “వెలుగు ఎక్కడా కనిపించడం లేదు, అంతా చీకటే” అని అన్నారు.“సామాన్య ప్రజానీకానికి ఒరిగేదేమీ లేదు. పేదలు, ప్రజావ్యతిరేక బడ్జెట్ ఇది. రాజకీయ పక్షపాతంతో కూడుకొంది. కేవలం ఒక పార్టీని బుజ్జగించేందుకు తెచ్చిన బడ్జెట్” అని మమత అన్నారు. బీజేపీపై విమర్శలు గుప్పిస్తూ, ఎన్నికల్లో వాళ్లు చాలా పెద్దపెద్ద వాగ్దానాలు చేసి వాటిని నెరవేర్చలేదని తప్పుపట్టారు. ఓట్లు గెలిచిన తర్వాత డార్జిలింగ్, కలింపాంగ్‌ను మరిచిపోయారని, డార్జిలింగ్ ప్రజలు మాత్రం ఈ విషయం గుర్తుపెట్టుకుంటారని చెప్పారు. సిక్కిం రాష్ట్రానికి వరాలు ప్రకటించడంపై తమకెలాంటి అభ్యంతరాలు లేవని, అయితే డార్జిలింగ్ ఎలాంటి ప్రయోజనాలకు నోచుకోకపోవడం మాత్రం సరికాదని అన్నారు.

## కొత్త పెన్షన్ విధానం పురోగతి చెందేలా కమిటీ

బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

ఉద్యోగుల సామాజిక భద్రతా ప్రయోజనాలను మెరుగుపర్చేలా నూతన పెన్షన్ స్కీమ్ (ఎన్‌పిఎస్) ను రూపొందించినట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో వెల్లడించారు. పెన్షన్ స్కీమ్‌ల సమీక్షకోసం ఫైనాన్స్ సెక్రటరీ టివి సోమనాథన్ నేతృత్వంలో ఒక కమిటీ గత ఏడాది ఏర్పాటైంది. కొత్త పెన్షన్ విధానం పురోగతి చెందేలా కమిటీ పర్యవేక్షిస్తుందని సీతారామన్ ప్రకటించారు. పాత పెన్షన్ స్కీమ్ కింద రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు తాము ఆఖరిసారి పొందే వేతనంలో 50 శాతం నెలవారీ పెన్షన్‌గా పొందడమవుతోందని చెప్పారు. ఈమొత్తం డిఎ రేటు ప్రకారం పెరుగుతుందని మంత్రి తెలిపారు. అయితే ప్రస్తుతం యాజమాన్యాలు తమ ఉద్యోగుల నూతన పెన్షన్ స్కీమ్‌కు తమ వాటాగా చెల్లించే మొత్తం(మూల వేతనం డీఎతో కలిపి)పై 10 శాతం వరకు పన్ను మినహాయింపు వర్తిస్తుండగా, ఇప్పుడు 14 శాతానికి పెంచినట్టు మంత్రి తెలిపారు. ప్రైవేట్ రంగ ఉద్యోగులు కానీ ప్రభుత్వరంగ బ్యాంకుల ఉద్యోగులు కానీ కొత్త పన్ను విధానాన్ని ఎంచుకుంటే వారికి కూడా ఎన్‌పిఎస్ వాటాపై 14 శాతం వరకు పన్ను రాయితీ లభిస్తుందని మంత్రి తెలిపారు. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు పొదుపు చేయడానికి వీలుగా కొత్త పెన్షన్ పథకంలో ‘ఎన్‌పిఎస్ వాత్సల్య’ అనే పథకాన్ని ప్రతిపాదించనున్నట్టు మంత్రి సీతారామన్ వెల్లడించారు.

## అనర్హత పిటిషన్లపై విచారణ వాయిదా

బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకటరావు, కడియం శ్రీహరిలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ పిటిషన్ దాఖలు చేసింది. కాగా, ఈ కేసుపై హైకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. వాదనలు విన్న న్యాయస్థానం తదుపరి విచారణను రేపటికి వాయిదా వేసింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసేలా అసెంబ్లీ స్పీకర్‌ను ఆదేశించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, వివేకానంద హైకోర్టుకు వెళ్లారు.

## యువతకు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్



బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో యువతకు ఉద్యోగాల కల్పనకు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ను ప్రకటించింది. ఈ కొత్త పథకం ప్రకారం వచ్చే ఐదేళ్లలో కోటి మంది యువతకు 500 టాప్ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ లభిస్తుంది. ఇంటర్న్‌షిప్ అంటే పరిమిత వ్యవధిలో ఒక సంస్థ అందించే శిక్షణ. ఈ శిక్షణార్థులకు (ఇంటర్న్‌లు) నెలకు రూ. 5000 అలవెన్సు, రూ.6000 వన్‌టైమ్ అసిస్టెన్స్ కూడా అందిస్తారు.

“ప్రధాని ప్యాకేజీ ఐదో స్కీమ్ కింద తమ ప్రభుత్వం కోటి మంది యువతకు ఐదేళ్లలో 500 టాప్ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ అవకాశాలను కల్పిస్తుంది ” అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ పథకంలో ఇంటర్న్‌కు 12 నెలల పాటు రియల్‌లైఫ్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ లో అనుభవం అందించడమే లక్షంగా పెట్టుకున్నారు. దీని ద్వారా వివిధ వృత్తులు, ఉపాధి అవకాశాలపై యువత అవగాహన పెంచుకునేందుకు అవకాశం లభిస్తుంది. ఆయా కంపెనీలు యువతకు ఉచితంగా శిక్షణ ఇస్తాయి.

ఈ శిక్షణ కోసం కంపెనీలు తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ( సిఎస్ఆర్ ) ఫండ్స్ నుంచి 10 శాతం వరకు నిధులు కేటాయిస్తాయి. అంటే సామాజిక కారణాల కోసం కంపెనీలు ఖర్చు చేయవలసిన డబ్బులో కొంత భాగం ఇంటర్న్‌లకు శిక్షణ ఇవ్వడానికి ఉపయో గించడమవుతుంది. దీని ద్వారా యువతలో నైపుణ్యాన్ని అభివృద్ధి చేసినట్టు అవుతుంది. ఇదే సమయంలో కంపెనీలకు సిఎస్ఆర్ బాధ్యతలను నెరవేర్చినట్టు అవుతుంది. మరోవైపు మహిళలు, బాలికల కోసం ప్రత్యేకం గా రూ.3 లక్షల కోట్లతో పథకాల్ని బడ్జెట్‌లో ప్రకటించారు. ఇందులో భాగంగా విద్య, ఉపాధి , నైపుణ్యాభివృద్ధి కోసం రూ.1.48 లక్షల కోట్లు వెచ్చించారు. దీంతోపాటు దేశ వ్యాప్తంగా 12 ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేస్తామని సీతారామన్ ప్రకటించారు. ఈ కొత్త ఇండస్ట్రియల్ పార్కులతో మరింత మంది యువతకు ఉద్యోగ అవకాశాలు దక్కే వీలు కలుగుతుంది.